క్లుప్తంగా

95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి


మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో శుక్రవారం సాయంత్రం వరకు పింఛన్ల పంపిణీ 95 శాతం పూర్తయినట్లు మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. మిగిలిన 5 శాతం వివిధ జబ్బులతో బాధపడుతున్న వారు, మంచం పట్టిన వారు, దివ్యాంగులు, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి మాత్రమే పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఎవరైనా పింఛన్ల కోసం కాల్ చేస్తే వారి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లను పంపిణీ చేస్తామని చెప్పారు. ఈనెల 8వ తేదీ వరకు పింఛన్ల పంపిణీకి సమయం ఉందని తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి


పెండేకల్లు అంజినమ్మ (ఫైల్)

కోసిగి: స్థానిక చింతలగేని కాలనీ నివాసం ఉంటున్న పెండేకంటి అంజినమ్మ (101) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు నలుగు కుమార్తెలు ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లు చేసింది. ఆమె చివరి వరకు ఒకరిపై ఆధారపడకుండా సొంతంగా పనులు చేసుకునేదని కుటుంబ సభ్యులు తెలిపారు. శవిషయం తెలుసుకుని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి ఆమె మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన


సూగూరు పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్వో మురళి

మంత్రాలయం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు బూత్‌లను ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఎ.మురళి తనిఖీ చేశారు. శుక్రవారం మండలంలోని చిలకలడోణ, సూగూరు, వగరూరు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఆర్వో మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లలో అన్ని సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఆటంకాలు కలుగకూడదన్నారు. తహసీల్దార్ శ్రీధర్ మూర్తి, వీఆర్వో ఆనంద్ ఉన్నారు.

నేటి నుంచి ఎన్నికల ప్రచారం

కౌతాళం: మండలంలో శనివారం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, నదిచాగి ఎంపీటీసీ లింగన్నగౌడ్, గ్రామ ఇన్‌చార్జి రామన్నగౌడ్ శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తరఫున మండలంలో ప్రచారం చేపడతామని, అంతకుముందు మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేపడతామని చెప్పారు. ఎమ్మెల్యే కుమార్తె ప్రియాంకరెడ్డి పాల్గొంటారన్నారు. శనివారం మేళిగనూరు, నదిచాగి గ్రామాల్లో ప్రచారం కొనసాగిస్తామని పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న మద్యంను చూపుతున్న పోలీసులు

కౌతాళం: మండలంలోని బదినేహాల్ గ్రామానికి చెందిన లోకేష్ కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యాన్ని టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనంపై తీసుకొచ్చి గ్రామంలోనే అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో నిఘా ఉంచి శుక్రవారం బదినేహాల్ గ్రామంలో సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. లోకేష్ నుంచి 3బాక్స్‌లు మొత్తం 288 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ ప్యాకెట్లను, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

మృతుడు బదినేహాల్ వాసి

ఆదోని రూరల్: మండలంలోని కడితోట–గణేకల్ రహదారిలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన విషయం తెలిసిందే. పోలీసుల విచారణలో మృతుడు కౌతాళం మండలం బదినేహాల్‌కు చెందిన సోమనాథ రెడ్డి (52)గా గుర్తించారు. మద్యం మత్తులో నడిచి వెళుతుండగా కింద పడడంతో తలకు తీవ్ర గాయమై మృతిచెందినట్లు పెద్దతుంబళం ఎస్ఐ చిన్నపీరయ్య శుక్రవారం విలేకరులకు తెలిపారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తుగ్గలి: మండల పరిధిలోని చెర్వుతండాలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడు గుత్తి మండలం బసినేపల్లికి చెందిన షేక్ దాదాపీరా (45)గా గుర్తించారు. మృతుడి తల వెనుకవైపు రక్తగాయాలు ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడికి మద్యం సేవించే అలవాటు ఉంది. డీహైడ్రేషన్‌కు గురై కిందపడి మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు తెలిపినట్లు జొన్నగిరి పోలీసులు పేర్కొన్నారు. మృతిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

ఉంటుందా.. ఊడుతుందా?

- మంత్రాలయం టీడీపీ అభ్యర్థిపై పెరుగుతున్న అసంతృప్తి
- బరిలో నుంచి తప్పించే యోచనలో టీడీపీ అధిష్టానం?
- బీదా రవిచంద్ర నేతృత్వంలో మంతనాలు


కర్నూలు పార్టీ ఆఫీసులో రాఘవేంద్రరెడ్డితో చర్చిస్తున్న బీదా రవిచంద్ర


ఎస్.రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం : అంతా గందరగోళం.. అయోమయం..ఇచ్చిన సీటు ఉంటుందో తెలియని పరిస్థితి.. రోజుకో పరీక్ష.. తల ప్రాణం తోకకు వచ్చేలా ప్రశ్నలు.. పోటీలో ఉండాలో.. తప్పుకోవాలో దిక్కుతోచనిస్థితి.. బీసీ అభ్యర్థి అయినా నేటికీ దక్కని భరోసా.. చంద్రబాబు మంత్రమో.. తంత్రమో.. బీసీల పార్టీ అంటూనే బీసీ అభ్యర్థికి పొగ పెట్టేసిన తీరు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అటు రాబిన్ శర్మ టీమ్, ఇటు పార్టీ ఇన్‌చార్జ్‌ల నేతృత్వంలో మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఎస్. రాఘవేంద్రరెడ్డితో మంతనాలు ముమ్మరం చేశారు.

బలంగా బాలనాగిరెడ్డి..

2009లో మంత్రాలయం నియోజకవర్గం ఆవిర్భవించింది. మూడు పర్యాయాలు ఎన్నికలు జరుగగా వై.బాలనాగిరెడ్డి విజయం సాధించారు. ప్రజాబలంతో తిరుగులేని నేతగా ఎదిగారు. అంతటి నేతను ఢీ కొట్టాలంటే ప్రజా విశ్వాసం చూరగొన్న నేత కావాలి. టీడీపీ అభ్యర్థిగా పాలకుర్తి తిక్కారెడ్డి 2014, 2019 ఎన్నికల్లో తలబడ్డారు. ఎంత శ్రమించినా బాలనాగిరెడ్డి ధాటికి తట్టుకోలేకపోయారు. 12 ఏళ్లుగా తిక్కారెడ్డి టీడీపీ ఉనికిని కాపాడుకుంటూ వస్తున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో తిక్కారెడ్డి నిలబెడితే ఓటమి తప్పేలా లేదని భావించిన టీడీపీ అధిష్టానం బీసీ కార్డును పరీక్షిద్దామని వైఎస్సార్‌సీపీ నుంచి ఫిరాయించిన ఎస్.రాఘవేంద్రరెడ్డికి టికెట్ కేటాయించింది. అభ్యర్థిని ప్రకటించి 16 రోజులు కావొస్తున్నా ఆశించిన స్థాయిలో మార్పు లేకపోగా.. పాత నాయకత్వం ఆయనతో జతకట్టకపోవడం, స్థానికంగా అసంతృప్తి స్థాయి పెరిగిపోతుండటంతో అధిష్టానం టిక్కెట్ విషయంలో పునరాలోచనలో పడింది. బాలనాగిరెడ్డిని ఢీకొట్టాలంటే అంత ఆషామాషీ కాదన్న ఆలోచనకు వచ్చారు. ఒకవైపు ఆ పార్టీ సలహాదారు రాబిన్ శర్మ ప్రత్యేక దృష్టి సారించి సర్వేలు చేయించినా గెలుపు అవకాశాలు లేవని తేలడంతో ఇక అభ్యర్థిని తప్పించడమే మార్గమని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీ జోనల్ ఇన్‌చార్జ్ బీదా రవిచంద్రను పంపి విషయం తేల్చమని పార్టీ అధిష్టానం ఆదేశించింది. దీంతో ఆయన బుధవారం ఎమ్మిగనూరులోని తిక్కారెడ్డి ఇంట్లో సమాలోచనలు జరిపారు. రాఘవేంద్రరెడ్డికి సపోర్టుగా నిలవాలని కోరగా.. నిలిచే ప్రసక్తి లేదని తిక్కారెడ్డి తేల్చిచెబుతూ.. అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతానని స్పష్టం చేయడంతో అధిష్టానం పంపిన దూతలకు అర్థం కాలేదు. చేసేదేమి లేక బీదా రవిచంద్ర గురువారం ఎస్.రాఘవేంద్రరెడ్డిని పిలిపించి సమాలోచనలు చేశారు. పార్టీ ఎంతో నమ్మకంతో టిక్కెట్ ఇచ్చింది.. అయినా గెలిచే అవకాశాలు పెద్దగా కనిపించడం లేదు.. ఇలాగైతే ఎలాగని ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. కాగా గ్రామస్థాయి నాయకులు సైతం రాఘవేంద్రరెడ్డితో కలిసి రాకపోవడంతో డైలామాలో పడ్డారు. పునరాలోచనలో భాగంగా అటు ఇటు ఐతే తమ పరిస్థితి ఏంటోనన్న ఆందోళనలో రాఘవేంద్రరెడ్డి ఉండిపోయారు. ఇప్పటికే కోట్లాది రూపాయలు సమర్పించుకున్నట్లు తెలుస్తోంది. తిక్కారెడ్డి పాచిక పారిందంటే ఇక రాఘవేంద్రరెడ్డి పరిస్థితి అగమ్యగోచరమేనని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. ఒకవేళ తిక్కారెడ్డి బరిలో నిలిచినా వైఎస్సార్‌సీపీ గెలుపు నల్లేరుపై నడకేనని ఆ పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. రాఘవేంద్రారెడ్డిని బరిలో నుంచి తప్పిస్తే బీసీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశముంది.

జనరంజక పాలనను కొనసాగించుకుందాం


కోసిగిలో ప్రచారం చేస్తున్న మురళీమోహన్ రెడ్డి

కోసిగి: సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జనరంజకంగా పాలిస్తున్నారని, ఈ పాలనను, సంతోషాన్ని కొనసాగించుకుందామని, అందుకు మరోసారి జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీమోహన్ రెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక 1, 7,8,9వ వార్డుల్లో ఎమ్మెల్యేగా వై. బాలనాగిరెడ్డిని మరోసారి గెలిపించాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ, వైఎస్సార్‌సీపీ హయాంలోని పాలనలోని తేడాలను గమనించాలని, ఎవరు చిత్తశుద్ధి గల నాయకుడో మీరే చెప్పాలన్నారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన జగనన్నకు హామీలను మరచిన చంద్రబాబుకు ఎంతో వ్యత్యాసముందని చెప్పారు. కోసిగిలో వీధి వీధిన డ్రైనేజీ, సీసీ రోడ్లు వేయించారన్నారు. సాగు, తాగునీటిని అందించేందుకు పులికనుమ ప్రాజెక్ట్ నుంచి రూ.6 కోట్లు వెచ్చించి పైప్‌లైన్ వేయించారని చెప్పారు. అభివృద్ధి ని చూసి ఓటు వేయాలని అభ్యర్థించారు. పార్టీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, శ్రీనివాస రెడ్డి, నాడుగేని నాగరాజు, మంగమ్మ, కోసిగయ్య, మాణిక్యరాజు, గానిగ వీరస్వామి, బుళ్లి నరసింహులు, ప్రతాప్, ప్రవీణ్ కుమార్, మల్లికార్జున గౌడ, దొడ్డి నరసన్న పాల్గొన్నారు.

‘సీ విజిల్’ ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

- ఎంసీసీ నోడల్ అధికారి జీ నాసరరెడ్డి



కర్నూలు(అర్బన్): ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ‘సీ విజిల్ ’ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) నోడల్ అధికారి జి. నాసరరెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా ఇప్పటి వరకు 144 ఫిర్యాదులు రాగా, అందులో సహేతుకమైన 96 ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో 82 ఫిర్యాదులను నిర్ణీత సమయం 100 నిమిషాల్లోనే పరిష్కరించామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించి 25 మంది వలంటీర్లు, మెప్మా ఆర్పీ -1, కేఎంసీ డ్రైవర్ ఆప్కాస్ -2, హెచ్ కైరవాడి పీహెచ్‌సీ అటెండర్ -1, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ -1, డీఆర్‌డీఏ, ఐకేపీ వీఓఏలు -2, రైతు మిత్ర -1, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠపై ఎఫ్ఐఆర్ నమోదు చేయించామన్నారు. మొత్తం 34 మందిపై చర్యలు తీసుకున్నామని, ఇందులో 33 మందిని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని, ఒకరిపై ఎన్నికల నియమావళి ఉల్లంఘించినందున కేసు నమోదు చేశామన్నారు. అలాగే గోడలపై రాతలు, పోస్టర్లు, బ్యానర్లు తదితర వాటిని వేల సంఖ్యలో తొలగించినట్లు చెప్పారు.

ఓటరును ప్రలోభాలకు గురిచేస్తే శిక్షలు తప్పవు



ఆదోని సెంట్రల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రభావితం చేసేందుకు పోటీ పడుతుంటాయి. అభ్యర్థులు నిబంధనలను అతిక్రమిస్తే ఆయా చట్టాలు కింద కేసులు నమోదవుతాయి. ప్రజాప్రాతినిధ్య చట్టం1951 భారత శిక్షాస్మృతి చట్టాల కింద నమోదయ్యే కేసుల్లో నేరం రుజువైతే జరిమానా లేదా జరిమానాతో పాటు శిక్షకు గురవుతారు.

విద్వేష పూర్వకంగా ప్రసంగాలు

ఎదుటి వారి మనోభావాలను కించపరచడం వంటివి చేయకూడదు. ఓట్ల కోసం కులం, మతం, సామాజిక వర్గాన్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయకూడదు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 125 కింద కేసు నమోదు చేస్తారు.

ఓటర్లను బెదిరిస్తే..

ఓటర్లను ఒత్తిడికి గురిచేయడం, బెదిరించడం తీవ్రమైన నేరం. ప్రతి ఓటరుకు స్వేచ్ఛగా తన ఓటు హక్కు వినియోగించుకునే హక్కు ఉంటుంది. ఈ విషయంలో ఎవరు జోక్యం చేసుకోకూడదు. ఇలా చేసినట్లు రుజువైతే ఐపీసీ 171(సీ) చట్టం కింద కేసు నమోదవుతుంది.

లేనిది ఉన్నట్లు చెప్పినా..

ప్రచారం చేసే అభ్యర్థులు ప్రజలను అకర్షించేందుకు ఒక్కోసారి అబద్ధాలు చెబుతుంటారు. లేనిది ఉన్నట్టు ఉన్నది లేనట్టు ప్రచారం చేస్తుంటారు. దీనిపై కూడా ప్రత్యర్థులు ఫిర్యాదు చేయవచ్చు. ఐపీసీ 171(జి) కింద కేసు నమోదు చేస్తారు.

కానుకలు పంపిణీ చేస్తే

ఎన్నికల సమయంలో అన్నదానాలు, వినోద కార్యక్రమాలు చేయకూడదు. ఓటర్లకు మద్యం, కానుకలు పంపిణీ చేసి ప్రలోభాలకు గురి చేయకూడదు. నిబంధనలను ఉల్లంఘించినట్లయితే ఐపీసీ 171(ఇ) చట్టం కింద శిక్షార్హులవుతారు.

ఖర్చుల వివరాలు చూపకుంటే

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికలకు సంబంధించిన ఖర్చుల వివరాలను ఎన్నికలు ముగిసిన నెలలోగా అందించాలి. లేకుంటే ఐపీసీ 171(ఐ) సెక్షన్ కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటారు.

మద్యం పంపిణీ చేసినా..

ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు మద్యం ఎక్కువగా పంపిణీ చేస్తుంటారు. ఎన్నికలు వచ్చాయంటే మొదటగా గుర్తుకు వచ్చేది మద్యం. అయితే నిబంధనల ప్రకారం ఓవ్యక్తి మూడు సీసాలకు మించి తీసుకెళ్లకూడదు. అలా తీసుకెళితే చట్టరీత్యా నేరం అవుతుంది. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు నిబంధనలకు విరుద్ధంగా భారీ మొత్తంలో మద్యం రవాణ చేసి పట్టుబడితే అబ్కారీ చట్టం 1968 సెక్షన్ 24 (ఎ) కింద కేసు నమోదు చేస్తారు. దీనికి ఆరు నెలల నుంచి సంవత్సరం పాటు జైలు శిక్షపడే అవకాశం ఉంది. జరిమానా రూ. 5 వేల నుంచి రూ. 20 వేల వరకు విధిస్తారు.

డబ్బులు పంపిణీ చేసినా..

అభ్యర్థులు లంచం రూపంలో డబ్బులిచ్చినా, ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసినా ఐపీసీ 171(బి) సెక్షన్ కింద చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అభ్యర్థులు అక్రమ చెల్లింపులు చేయడం నేరం. ఇలా చేస్తే ఐపీసీ 171(హెచ్) కింద చర్యలు తీసుకుంటారు.

ప్రచార సమయం మించరాదు

నిబంధనలకు విరుద్ధంగా మైకులు వాడటం. ప్రచార సామగ్రి వినియోగించడం నేరం. అభ్యర్థులకు కేటాయించిన సమయంలో మాత్రమే వినియోగించుకోవాలి. అయితే నింబంధనలకు విరుద్ధంగా అభ్యర్థులు తమ ప్రచారాన్ని కొనసాగిస్తే ఐపీసీ 171(ఎఫ్) చట్టం కింద తప్పకుండా చర్యలు తీసుకుంటారు.

ఘనంగా బాబూజీ జయంతి వేడుకలు



సబ్ కలెక్టర్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఉద్యోగులు, ఎంఎం కాలనీలో..


ఆదోని: తిమ్మారెడ్డి బస్టాండ్ వద్దనున్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


ఎస్టీయూ నాయకులు

ఆదోని రూరల్/ఆదోని సెంట్రల్/ఆదోని టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సి.ఆర్.శేషయ్య, ఉప తహసీల్దార్‌లు రుద్రగౌడ్, దీప తదితరులు బాబూజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

- స్థానిక ఎంఎం కాలనీలో వార్డు కౌన్సిలర్ చిన్నా ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.
- పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండ్ వద్ద బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నేతలు గర్జల నరసింహులు, ఎం.విజయరాజు, మన్మోహన్, నరేష్, నరసింహా సాయిరామ్, ప్రసాద్ తదితరులు పుష్పాంజలి ఘటించారు.
- పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో ఆ సంఘం నేతలు వి.శ్రీనివాసులు, రమేష్ నాయుడు, నాగేంద్రప్ప నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల వారికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. సంఘం నాయకులు రమేష్, నాగప్రసాద్, ఎం.శ్రీనివాసులు, జ్యోతిమూర్తి, రంగన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు
- స్థానిక ఎస్‌కేడీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, మాజీ కౌన్సిలర్ గోవిందరాజులు, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు చెన్నబసప్ప, సింహం నాగేంద్ర, తాయన్న, సిద్ధ మల్లికార్జున, జీకే రాజు, గంగాధర్, లక్ష్మీ, వెంకటేశులు, కిషోర్, రంగస్వామి, హరి, వీరాంజనేయులు, శీనుతదితరులు పాల్గొన్నారు.

ఆదోని అర్బన్: సమ సమాజ నిర్మాణం కోసం కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) ఆదోనిశాఖ అధ్యక్షుడు భాస్కర్ అన్నారు. స్థానిక తిమ్మారెడ్డి బస్టాండ్ సెంటర్‌లోని బాబు జగ్జీవన్ విగ్రహానికి ఆ సంఘం నాయకులు నివాళులు అర్పించారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సంఘం నాయకులు చంద్రశేఖర్, జయరామ్, లక్ష్మన్న, రాము, రామన్న, కేశన్న, జోజప్ప తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : దేశ సమగ్రత, జాతి సమైక్యతకు కృషిచేసి భారత రాజ్యాంగానికి కాపలదారుడుగా వ్యవహరించిన గొప్ప నాయకుడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అని జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఫోరమ్ ఫర్ ఆర్‌టీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బొగ్గుల తిక్కన్న, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు యువరాజు, సతీష్ అన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం వేర్వేరుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


ఆదోని: నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు,


బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు,


పెద్దకడబూరులో..

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి


నిల్వ నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక ఎ.క్యాంపులోని మెరిడియన్ ఫంక్షన్ హాలు వద్ద ఉన్న యూపీహెచ్‌సీని తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే దోమల నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. దోమల వల్ల డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్ గున్యా, మెదడువాపు వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దోమ పుట్టుకను నివారించేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతోందని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. వారంలో ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఇళ్ల పరిసరాల్లో పాత కూలర్లు, టైర్లు, డ్రమ్ములు, కొబ్బరి చిప్పలు, రోళ్లు, పగిలిన కుండలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఓవర్‌హెడ్ ట్యాంకులపై మూతలు ఉంచాలని, దోమలు రాకుండా కిటికీలు, బయట తలుపులకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించాలని, నిద్రించే సమయంలో దోమ తెరలు ఉపయోగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎండాకాలంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు దగ్గర ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పకుండా ఉండాలని ఆయన సూచించారు. అనంతరం అక్కడికి వచ్చిన వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.


పట్టుబడిన మద్యంతో సెబ్ అధికారులు

కర్ణాటక మద్యం స్వాధీనం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని అటికెలగుండు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన కర్ణాటక మద్యం 1440 టెట్రా ప్యాకెట్లను స్వా ధీనం చేసుకుని బోయ వెంకటరాముడు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు పత్తికొండ సెబ్ సీఐ స్వర్ణలత శుక్రవారం తెలిపారు. సమాచారం మేరకు గ్రామంలో దాడులు నిర్వహించగా ఓ ఇంట్లో అట్టపెట్టెల్లో నిల్వ ఉంచిన మద్యంను గుర్తించామన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందన్నారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ కార్తీక్‌సాగర్, సిబ్బంది ఉన్నారు.

9 నుంచి తిమ్మగురుడు స్వామి తిరునాల



కృష్ణగిరి: మండల పరిధిలోని ఎరుకల చెర్వు గ్రామంలో కొండపై వెలసిన భక్తుల ఆరాధ్య దైవం తిమ్మగురుడు స్వామి తిరునాలను ఈ నెల 9వ తేదీ నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. గ్రామం మధ్యలో కొండపై వెలసిన తిమ్మగురుడు స్వామికి మంగళవారం ప్రతి ఇంటి నుంచి నేవైద్యం తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 10న ఉదయం 6 గంటలకు స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రభపై ఉంచి ఊరేగించడం జరుగుతుందని, సాయంత్రం స్వామివారికి పల్లకీసేవ ఉంటుందన్నారు. తిరునాల సంరద్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మరో మహిళా కూలీ మృతి

- ఐదుకు చేరిన మృతుల సంఖ్య


వెంకటేశ్వరమ్మ (ఫైల్)

మద్దికెర: మార్చి 31వ తేదీన మిరప పంటను కోయడానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో మద్దికెర గ్రామ శివార్లలో ఉన్న కోతులమాను వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గొడుగు వెంకటేశ్వరమ్మ (55) చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. దీంతో ప్రమాద మృతుల సంఖ్య ఐదుకు చేరింది. వాహనం టైరు పేలడంతో అదుపుతప్పి ప్రమాదం చోటుచేసుకోగా తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరమ్మను మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. నాలుగు రోజులుగా వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందింది. మృతురాలికి భర్త గొడుగు ప్రభాకర్, కొడుకు, కూతురు ఉన్నారు.

దొంగలను పట్టిచ్చిన గ్రామస్తులు

ఆస్పరి: మండలంలోని బిణిగేరి గ్రామంలో చోరీ చేసేందుకు వచ్చిన ఇద్దరిని గ్రామస్తులు పట్టుకుని ఆస్పరి పోలీసులకు అప్పగించారు. గురువారం రాత్రి ఇద్దరు దొంగలు ఒక ఇంట్లోకి ప్రవేశించి సెల్‌ఫోన్ దొంగలిస్తుండగా మెలకువతో ఉన్న ఇంటి యజమాని కేకలు వేశాడు. ఇరుగుపొరుగు వారు అప్రమత్తమై పరుగెడుతున్న దొంగలను పట్టుకున్నారు. అనంతరం ఆస్పరి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు వెళ్లి దొంగలను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై సీఐ హనుమంతప్ప మాట్లాడుతూ.. బిణిగేరి గ్రామస్తులు దొంగలను పట్టిచ్చిన మాట వాస్తవమేనని నిందితులను విచారిస్తున్నట్లు చెప్పారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతి

ఆస్పరి: ఆస్పరిలో అంగన్‌వాడీ–2 కార్యకర్తగా పనిచేస్తున్న జయమ్మ (52) అనారోగ్యంతో మృతి చెందినట్లు శుక్రవారం కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామైన బిణిగేరికి తీసుకెళ్లారు. శుక్రవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శివలింగమ్మ, పద్మ, కార్యకర్తలు వెళ్లి జయమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వెల్లివిరిసిన మతసామరస్యం


ఇఫ్తార్ విందులో భాగంగా లడ్డూ పంపిణీ చేస్తున్న హిందువులు

వెల్దుర్తి(కృష్ణగిరి): రంజాన్ మాసం పురస్కరించుకుని ఉపవాస దీక్షలో ఉన్న పట్టణ ముస్లింలకు బ్రహ్మగుండం ఆలయ ప్రధాన అర్చకులు యార్లపాటి శ్రీధర్‌శర్మ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. శుక్రవారం జామీయా మసీదులో ఉపవాస దీక్ష విరమించే సమయంలో ముస్లింలకు భోజనాలు ఏర్పాటు చేసి కుటుంబసభ్యులతో కలిసి వడ్డించారు. మత సామరస్యాన్ని చాటుతూ పండితుడు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును ఆరగించిన ముస్లింలు సంతోషం వ్యక్తం చేశారు. ఏటా ఆయన రంజాన్ మాసంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తుండడం విశేషం.